క్లుప్తంగా

బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న డీపీటీఓ వరలక్ష్మి, తదితరులు

వేపాడ: మండలంలోని సోంపురం నుంచి జాకేరు మీదుగా బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలకు ఏర్పాటు చేసిన బస్సు సర్వీస్‌ను డీపీటీఓ జి.వరలక్ష్మి సోమవారం ప్రారంభించారు. సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కృషి ఫలితంగా అధికారులు బస్సు వేయడంపై జాకేరు, చామలాపల్లి, కరకవలస, దబ్బిరాజుపేట, పోతుబందిపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల విద్యార్థులకు మేలు కలగనుంది. ఈ సందర్భంగా జాకేరు సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, అప్పలనాయుడు దంపతులు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావును సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.కోట డిపో మేనేజర్ రమేష్, ఎస్‌టీఐ వెంకటరావు, సెక్యూరిటీ సత్యారావుతో పాటు ఆర్టీసీ సిబ్బంది వేపాడ, వల్లంపూడి గ్రామపెద్దలు గుమ్మడి భారతి, ఎస్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన

గజపతినగరం: మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీని (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) బొబ్బిలి డీఎల్‌పీఓ, డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎమ్.కిరణ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. కేంద్రంలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, వర్మీకంపోస్టు తయారీని పరిశీలించి క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. మండలంలో అన్ని ఎస్‌డబ్ల్యూపీసీలు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న ఈఓపీఆర్డీ సుగుణాకరరావును ఆదేశించారు. కేంద్రాల్లో తయారు చేసే వర్మీకంపోస్టును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని సూచించారు. ఆయన వెంట గజపతినగరం పంచాయతీ ఈఓ జనార్దనరావు, తదితరులు ఉన్నారు.

పీఏఐపై శిక్షణ నేడు

దత్తిరాజేరు: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై అనుభవజ్ఞులైన అధికారులు శిక్షణ ఇస్తారని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు సత్కారం



కెంగువ మధుసూధనరావుకు సత్కారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ వింగ్ ప్రధాన కార్యదర్శి కెంగువ మధుసూదనరావు, జిల్లా ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడు బెల్లాన బంగారునాయుడు, చీపురుపల్లి నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోళ్ల సుబ్రహ్మణ్యాన్ని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం దుశ్శాలువలతో సత్కరించారు. పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

నియామకం..



గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శిగా స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు గేదెల శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు పార్టీ పదవి వరిచేందుకు సహకరించిన పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులకు గేదెల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీనివాసరావు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జన సురక్ష యోజనతో భరోసా..



సురక్ష పథకంపై అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ సునీత

వేపాడ: ప్రధానమంత్రి సురక్ష యోజన పథకంలో చేరడం వల్ల కుటుంబానికి భరోసా ఏర్పడుతుందని వేపాడ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సునీత అన్నారు. మండలంలోని ఆతవ గ్రామంలో సీఎస్పీ బంగారమ్మ నేతృత్వంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మేనేజర్ సునీత మాట్లాడుతూ.. ఖాతాదారులు సురక్ష పథకంలో చేరాలన్నారు. అలాగే బ్యాంక్‌లో బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది మహేష్, సీఎస్పీలు ఈశ్వరరావు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

కూటమిది అబద్ధాల పాలన

- హామీలు అమలుచేయకుండా ప్రజలకు వంచన
- రానున్న ఎన్నికల్లో టీడీపీ గల్లంతు ఖాయం
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీపై ఇంటింటా ప్రచారం
- గ్రామాల్లోకి వెళ్లి కూటమి వైఫల్యాలపై ప్రజలను చైతన్యవంతులను చేయండి
- జగన్ 2.0తో మళ్లీ సంక్షేమ పాలన
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- గజపతినగరంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ గజపతినగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

గజపతినగరం రూరల్: కూటమిది అబద్ధాల పాలన. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అమలు చేయకుండా జనాన్ని మోసం చేస్తోంది. దీనిని జనంలోకి తీసుకెళ్లి చంద్రబాబు ప్రభుత్వం మొడలు వంచేందుకు మనమంతా సైనికుల్లా ముందుకు సాగాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జిశ్రీనువాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమం అంటే ఏమిటో రాష్ట్ర ప్రజలకు గడిచిన ఐదేళ్లలో వివిధ పథకాలతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ విషయాన్ని ఐదు వారాల్లో క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులను కోరారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఎంతమేర నష్టపోయారన్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటింటి ప్రచారంతోపాటు రచ్చబండ వద్ద సమావేశం ఏర్పాటుచేసి కూటమి ప్రభుత్వ పాలన వైఫల్యాలపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటపై నిలబడటమే కాకుండా తమ నాయకులకు అదేబాట అలవాటుచేశారని, కార్యకర్తలకు ఎక్కడ కష్టం వచ్చినా తానున్నానంటూ భరోసా కల్పించి అక్కున చేర్చుకునే గుణం శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ నుంచి తమకు అలవడిందన్నారు.

కొండపల్లి మంత్రి అయినా ప్రయోజనం శూన్యం

కొండపల్లి శ్రీనివాస్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా పాలనపట్ల కనీస అవగాహన లేకపోవడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం శూన్యంగా కనిపిస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. అవినీతి పనులతో అక్రమార్జన చేస్తూ కొండపల్లి శ్రీనివాస్ కుటుంబం మాత్రం సంపన్నుల జాబితాలో చేరిందన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో గ్రామంలో తమకు అనుకూలమైన వారి ఇళ్లకు వెళ్లి అరగంటలో కార్యక్రమాన్ని ముగించేస్తున్నారని, ప్రజలు నిలదీస్తారన్న భయం మంత్రికి పట్టుకుందన్నారు. మంత్రి గ్రామమైన గంట్యాడ నుంచి విజయనగరం కలెక్టరేట్ వరకు ఉన్న మార్గంలో పరిశీలిస్తే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమయంలో మంత్రి బొత్స చేసిన అభివృద్ధి కళ్లకు కడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నారాయణమూర్తిరాజు, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, బొండపల్లి, జామి మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు దిక్కేది



కూటమి ప్రభుత్వంలో రైతన్నకు భరోసాలేకుండాపోయింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా పెట్టుబడి సాయం అందలేదు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేశారు. విత్తనాలు, ఎరువులు లభించడంలేదు. గత జగనన్న ప్రభుత్వంలో ఎరువులు, పురుగులమందులతో పాటు విత్తనాలు సమృద్ధిగా లభించేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించింది. ఇదే విషయాన్ని గ్రామగ్రామాన ఉన్న రైతులకు అవగాహన కలిగించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి.

– మంత్రి అప్పలనాయుడు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

రాష్ట్రంలో అరాచక పాలన



రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోంది. పోలీస్ వ్యవస్థ కూటమి నేతల చేతుల్లో కీలుబొమ్మలా మారింది. అన్ని శాఖల అధికారులు పచ్చచొక్కాల నేతల మాటలు వింటున్నారే తప్ప ప్రజలకు న్యాయం చేయడం లేదు. దీనిపై ప్రజలతో కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. కూటమి అబద్ధాల పాలన వివరిస్తూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుదాం.

– పీరుబండి జైహింద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

అనవసరంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని మాజీ శాసనసభ్యుడు బొత్స అప్పలనరసయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డి రూ.5లక్షల50వేలు కోట్లు అప్పులు చేశారని గగ్గోలు పెట్టిన చంద్రబాబు అందులో రూ.2లక్షల90 వేల కోట్లు ప్రజలకు వివిధ పథకాల కింద లబ్ధిచేకూర్చారన్న విషయాన్ని విస్మరిస్తున్నారంటే ఆయనకు ప్రజా సంక్షేమంపై ఉన్న శ్రద్ధను అర్థం చేసుకోవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే రూ. లక్షా60వేల కోట్లు అప్పులుచేశారని, ఆ డబ్బును ఏం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లి చూసినా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే కనబడుతోందన్నారు. సచివాలయాలకు సొంత భవనాలు, సీసీ రోడ్లు, కాలువల వంటివి దీనికి ప్రత్యక్షసాక్ష్యాలన్నారు. రాష్ట్రంలో కేవలం విద్యకే రూ.56వేల కోట్లు ఖర్చుచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజలకు వివరిస్తూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కడప తరువాత విజయనగరమే...



రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కడప తరువాత బలోపేతంగా ఉన్న ప్రాంతమేదైనా ఉందంటే అది విజయనగరమే. దీనికి బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావుల పటిష్ట నాయకత్వమే కారణం. గజపతినగరంలో బొత్స అప్పలనరసయ్యను ఎమ్మెల్యేగా గెలిపిస్తే జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసినట్టే. పార్టీ శ్రేణులంతా చంద్రబాబు హామీలిచ్చి మోసం చేసిన తీరును ఇంటింటికీ వివరించాలి. ప్రజలను చైతన్యవంతం చేయాలి.

– డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఎమ్మెల్సీ

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ పట్ల గ్రామగ్రామాన ప్రతీఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. చంద్రబాబుకు ఎందుకు ఓటేశామా అన్ని జిల్ల ప్రజలు మదనపడుతున్నారు. జగనన్న కాలంలో పొందిన లబ్ధిని గుర్తుచేసుకుని ఎన్నికల సమయంకోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు అవగాహన కలిగించి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం మనందరిపైనా ఉంది.

– బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం మాజీ ఎంపీ

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



పరిశ్రమలోని అడ్మిన్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కార్మికులను అడ్డుకుంటున్న ఎస్ఐ దామోదరరావు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద ఉన్న శ్రీ వెంకట్రామా పౌల్ట్రీ పరిశ్రమలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. పత్తికాయవలస, కరకాం, సంకుపాలెం, పి.కె.పాలవలస, గత్సలవలస తదితర గ్రామాలకు చెందిన కార్మికులు పరిశ్రమ ప్రధాన గేటు ముందు ధర్నా చేశారు. వీరికి టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. అన్యాయంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని రెండు నెలలుగా డిమాండ్ చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలంటూ ప్రధాన గేటును తొలగించుకుని పరిశ్రమ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంతలో సీఐ శంకరరావు నేతృత్వంలో చీపురుపల్లి, గరివిడి ఎస్ఐలు దామోదరరావు, లోకేశ్వరరావు సిబ్బందితో కలిసి వచ్చి కార్మికులను అడ్డుకున్నారు. పరిశ్రమలో ఉన్న ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి యాజమాన్యం కార్మికులతో చర్చలు జరుపుతుందని చెప్పి నిరసన విరమింపజేశారు.

పంచాయతీ అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



చీపురుపల్లి మేజర్ పంచాయతీ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ మంగళగిరి సుధారాణి

చీపురుపల్లి: పంచాయతీ అభివృద్ధికి సమష్టి కృషి అవసరమని చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి చెప్పారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. గ్రామసభలో చర్చించుకున్న అంశాలు పంచాయతీ అభివృద్ధికి కీలకమని, వాటిని అమలుచేసే బాధ్యత పంచాయతీ సిబ్బందిపై ఉందన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, గవిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఎస్.కోట పట్టణంలోని ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మంటపంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలో గల ఐదు మండలాలకు చెందిన పార్టీ ముఖ్య నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు. సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతందన్నారు. అలాగే దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి పుట్టిన రోజు వేడుకలు కొత్తవలస, ఎస్.కోట, జామి మండలాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మంచినీటి ట్యాంక్ తొలగింపు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో సుమారు 40 సంవత్సరాల కిందట నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రొంగలి సన్యాసిరావు ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. ఈ ట్యాంక్ స్థానంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో కొత్త ట్యాంక్ నిర్మిస్తామని జేఈ తెలిపారు.

అందరిపైనా దేవుడి ఆశీస్సులు ఉండాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): యేసు క్రీస్తు ఆశీస్సులు అందరిపైనా ఉండాలని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు ఆకాంక్షించారు. గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో సోమవారం జరిగిన యేసుక్రీస్తు ప్రార్థన మందిరం 20వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేయాలని, శాంతి, ప్రేమ, దయగుణము కలిగిన యేసు బోధనలను అనుసరించాలన్నారు. అనంతరం దైవ సేవకుని కుటుంబాన్ని సన్మానించారు. కార్యక్రమంలో దైవసేవకులు ఎం.స్టీవెన్, ప్రభాకరరావు, సంఘమిత్ర ఆర్‌ఎస్.జాన్, జి.సువార్తరావు, ఎం.జయరాజు, యెహోను, ఎం.నాయుడు, ఆనంద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కెల్ల కూడలిలో వైఎస్సార్ జయంతి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుర్ల: మండల కేంద్రంలోని కెల్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

బొత్స జన్మదిన వేడుకలు

మాజీ మంత్రి, శాసన మండలి విపక్ష నేత సత్యనారాయణ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహిస్తామని పార్టీ మండల నాయకులు తెలిపారు.

నేడు వైఎస్సార్ జయంతి

జామి: మండల కేంద్రంలోని రావిచెట్టు సమీపంలో గల కొత్తలివారి రామాలయం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం మూడు గంటలకు ఎస్.కోటలోని ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మంటపం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

దత్తిరాజేరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఆర్.రామచంద్రాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించనున్నామని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున సోమవారం తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.50,116 ఆర్థిక సహకారం



కమిటీ ప్రతినిధులకు ఆర్థిక సహకారం అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి గులివిందల వెంకట రామ్మోహనరావు, రమణి దంపతులు రూ.50,116లను కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. తల్లిదండ్రులు గులివిందల వెంకట రామారావు, తేజోవతి జ్ఞాపకార్థం ఆర్థిక సహకారం అందజేసినట్లు రామ్మోహనరావు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ భానుప్రకాష్‌రావు

గుర్ల: స్థానిక ఎమ్మార్సీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈఓ ఎస్.భాను ప్రకాష్, ఎంఈఓ–2 శ్రీనివాసరావు, సీఆర్పీలు పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ముసిరాం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. అనంతరం గ్రామస్తులకు ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పచ్చకామెర్లు, డయేరియా, తదితర వ్యాధుల నివారణ అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యారావు, ధనలక్ష్మి, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ సందర్శన



వసతిగృహ వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ, తదితరులు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహ ఆవరణలో గల పండ్ల మొక్కలను, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకూడదని సూచించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బొత్స'ను విమర్శించే అర్హత మీకు లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: నిరంతర ప్రజా సేవకుడు, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణను విమర్శించే అర్హత మంత్రి కొండపల్లి శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడితో కలిసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంపై కనీస పరిజ్ఞానంలేనివారు బొత్స కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఏడాది తిరగకముందే ఇచ్చిన ప్రతీ హామీను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థలతో పాటు పథకాలకు మంగళం పాడేశారన్నారు. తల్లికి వందనం పథకం లబ్ధి రాష్ట్ర వ్యాప్తంగా 83 లక్షలు మంది పిల్లలకు అందాల్సి ఉండగా కేవలం 43 లక్షలు మందికే అందజేశారన్నారు. ఉచిత గ్యాస్ పథకం ఎంత మందికి వచ్చిందో టీడీపీ నేతల తమ సొంత గ్రామాల్లో సర్వే చేసుకుంటే తెలుస్తుందన్నారు. మహిళలకు ప్రతినెలా ఇస్తామన్న రూ.1800 ఎంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్లు ఇస్తామని ఒక్కరికైనా ఇచ్చారా చెప్పాలని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఏడాదిలో 4 లక్షలు ఉద్యోగాలు లేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని ఎంతమందికి ఇచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు. జూన్ 21న రైతుభరోసా ఇస్తామని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించి ఇంతవరకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కొత్త పింఛన్లు విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చి ఇంతవరకు పింఛన్ డబ్బులు విడుదల చేయలేదని, దానికి సంబంధించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, నాయకులు పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, గవిడి సురేష్, కొసిరెడ్డి రమణ, రేవల్ల సత్తిబాబు, కర్రోతు ప్రసాద్, బలరాం, మజ్జి శంకర్, తదితరులు పాల్గొన్నారు.